క్లుప్తంగా

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డీఐఓ రవిరాజు

చిత్తూరు రూరల్: నగరంలోని పలు స్కానింగ్ కేంద్రాలను గురువారం డీఐఓ రవిరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. లింగనిర్ధారణ చట్టరీత్యా నేరామన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా సెంటర్ నిర్వహణ చేస్తే కేసులు ఉంటాయన్నారు. రెన్యువల్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని చెప్పారు. హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

పూతలపట్టు: మండల కేంద్రంలో గురువారం వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి, పార్టీ కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సర్పంచ్ ఎంఎస్ మణి పాల్గొన్నారు.

వ్యాక్సిన్ విధిగా వేయించాలి

చిత్తూరు రూరల్: సాధారణ వ్యాక్సిన్‌ను విధిగా వేయించాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఆమె అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాతాశిశు మరణాల నివారణకు ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. బీసీజీ అడల్ట్ వ్యాక్సినేషన్ ఇంటింటా సర్వేను పక్కాగా పూర్తి చేయాలన్నారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్, 108, ప్రభుత్వ వైద్య సేవలను గర్భిణులు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఐఓ రవిరాజు, అధికారులు జానకీరావ్, జార్జ్, గుణశేఖర్ పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి



ప్రేమ జంట

చిత్తూరు రూరల్: కుటుంబ సభ్యుల నుంచి రక్షణ కల్పించాలని ఓ ప్రేమ జంట గురువారం చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించింది. మీడియాకు వివరాలను వెల్లడించింది. వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన ధనలక్ష్మీ, తిరుపతికి చెందిన శివానంద కొన్నేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఇది తెలిసి ధనలక్ష్మీ కుటుంబీకులు ఇష్టంలేని పెళ్లి చేయబోయారు. దీంతో తాము ఇంట్లో వాళ్లకు తెలియకుండా పెళ్లి చేసుకున్నామని, కుటుంబ సభ్యుల నుంచి ప్రాణహాని ఉందని, తమకు రక్షణ కల్పించాలని కోరారు.

టెన్త్ టాపర్స్‌కు బహుమతి



గుడిపాల: మండలంలోని శ్రీరంగంపల్లె జెడ్పీ హైస్కూల్‌లో 2022–23లో పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. శ్రీరంగంపల్లె పాఠశాలలో గురువారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా గత సంవత్సరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన రీహానాకు రూ.10వేలు, ద్వితీయ ర్యాంకు సాధించిన ప్రమీళ కు రూ.5వేలను పాపిశెట్టిపల్లెకు చెందిన డాక్టర్ కేశవులు పాఠశాలకు అందించారు. ఈ నగదును ప్రధానోపాధ్యాయులు మధు వారికి అందజేశారు.

కిడ్నీ వ్యాధిపై అవగాహన

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం డయాలసిస్ క్లినిక్ ఆధ్వర్యంలో ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. కిడ్నీ వ్యాధి గల కారణాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కిడ్నీ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆరోగ్య సూత్రాలను వైద్య నిపుణులు తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్, పురుషోత్తం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వివాహితుడి ఆత్మహత్య

చిత్తూరు అర్బన్: ఓ వివాహితుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరులో చోటుచేసుకుంది. గురువారం వన్‌టౌన్ ఎస్‌ఐ షేక్‌షావలి తెలిపిన వివరాలు.. వేలూరు రోడ్డులోని నెహ్రూనగర్‌లో కాపురముంటున్న తబ్రాజ్‌ఖాన్(25) గిరింపేటలోని ఒక ఫర్నీచర్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ఒక పాప ఉన్నారు. బుధవారం రాత్రి ఇంటికి వచ్చిన అతడు తాను తెచ్చుకున్న పురుగులమందు తాగి తలుపు వేసుకున్నాడు. కయినికట్టువీధిలో ఉంటున్న అతని భార్య ఇంటికి వచ్చి తలుపు తట్టినా తీయకపోవడంతో నిద్రపోతున్నాడని భావించి ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. గురువారం తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానించింది. స్థానికుల సాయంతో తలుపు పగులగొట్టి చూస్తే లోపలచూస్తే మంచంపై తబ్రాజ్‌ఖాన్ విగతజీవిగా పడి ఉండటం చూసి భోరున విలపించింది. సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలేమిటో పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.

పదిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం



బంగారుపాళెం: ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు

బంగారుపాళెం: పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తమ ఫలితాలను సాధించడమే లక్ష్యంగా విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈఓ సందర్శించారు. పాఠశాలలో పలు రికార్డులను తనిఖీ చేశారు. నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు సంబంధించిన వసతులపై ఆరాతీశారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఈఓ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన పిల్లలే చదువుతున్నారని చెప్పారు. వారి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. పదోతరగతి పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మెరుగైన స్థానంలో నిలపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వర్‌రావు, హెచ్‌ఎం రాజేంద్రన్ పాల్గొన్నారు.

పూతలపట్టు: పదవ తరగతి పరీక్షలో వంద శాతం విద్యార్థులు ఉతీర్ణత సాధించాలని జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో గురువారం పదవ తరగతి వార్షికోత్సవం నిర్వహించారు. ఇందులో చంద్రశేఖర్ మాట్లాడుతూ జీవితంలో హైస్కూల్ విద్య మరపురానిదని, భవిష్యత్తులో గెలవడానికి ఇదే మొదటమెట్టని తెలిపారు. పదవతరగతి తర్వాత భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు హాల్‌టికెట్‌ను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ హెచ్‌ఎం విశ్వనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకురాలు గౌహతిరెడ్డి, రామ్మూర్తిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు

చిత్తూరు రూరల్: పది పరీక్ష ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించాలని జెడ్పీటీసీ ఎం.ఎస్ బాబు నాయుడు అన్నారు. చిత్తూరు మండలం బీఎన్‌ఆర్ పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసి జెడ్పీటీసీ పిల్లలను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ త్యాగరాజులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా పరీక్షలు రాయండి

యాదమరి: మండలంలోని పలు పాఠశాలల్లో వార్షికోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంతోపాటు, కె.గొల్లపల్లె ఉన్నత పాఠశాలల్లో గురువారం ఉదయం సరస్వతి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు రుక్మిణీ, ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. పదో తరగతి విద్యార్థులు నిర్భయంగా పరీక్షలు రాయాలని కోరారు.







చిత్తూరు: విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు, యాదమరి : సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసాద్, పూతలపట్టు: మాట్లాడుతున్న జిల్లా ఉపవిద్యాశాఖాధికారి చంద్రశేఖర్

ఎక్స్‌గ్రేషియా చెక్కుల పంపిణీ



మృతుల కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో అవుట్‌సోర్సింగ్ విభాగం కార్మికులుగా పనిచేస్తూ చనిపోయిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా చెక్కులను నగర మేయర్ ఎస్.అముద గురువారం పంపిణీ చేశారు. కార్పొరేషన్‌లో అవుట్ సోర్సింగ్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న ఆర్.మురుగన్, ఎ.శ్రీనివాసులు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబాలకు పరిహారం అందించేందుకకు కమిషనర్ అరుణ చర్యలు తీసుకున్నారు. మృతుల కుటుంబ సభ్యులు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున గురువారం చెక్కులను మేయర్ అందజేశారు.

అర్హులను నమోదు చేయాలి

తవణంపల్లె: అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయించాలని తహసీల్దార్ అరుణకుమారి బీఎల్వోలను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ అరుణకుమారి మట్లాడుతూ మండలంలో నూతన ఓటర్ల నమోదుకు వచ్చిన క్లైమ్‌లను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలన్నారు. మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో వసతులకల్పనకు యుద్ధప్రాతిపదకన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బీఎల్వోలు నిర్లక్ష్యం చేయకుండా విధులను నిర్వర్తించాలన్నారు. సమావేశంలో డీటీ నరేష్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

సూర్య చంద్రులపై మొగిలీశ్వర స్వామి విహారం





సూర్య ప్రభవాహనంపై మొగిలీశ్వరుడు, కామాక్షమ్మ, చంద్ర ప్రభ వాహనంపై స్వామి, అమ్మవారు

బంగారుపాళెం: మొగిలి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పదో రోజు గురువారం ఉదయం మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మవారు సూర్యప్రభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దివ్యాశీసులను అందించారు. స్వామి, అమ్మవారి మూలవర్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ మూర్తులను ఉదయం వివిధ రకాల పుష్పాలతో అలంకరించి సూర్య ప్రభవాహనంపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ చంద్ర ప్రభ వాహనంపై అధిరోహించి ఆలయ మాడవీధుల్లో మంగళ వాయిద్యాల నడుమ ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవారికి కర్పూర నీరాజనాలు పలికి మొక్కులు చెల్లించుకున్నారు. చివరగా స్వామి, అమ్మ వారికి శయనోత్సవాన్ని నిర్వహించారు. సూర్య ప్రభ వాహన సేవకు నలగాంపల్లెకు చెందిన నరసింహులునాయుడు, మునెమ్మ కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించగా, వసంతోత్సవం, త్రిశూలస్నానం, ధ్వజావరోహణం కార్యక్రమాలకు మొగిలి దేవస్థానం, చంద్ర ప్రభ వాహన సేవకు బంగారుపాళెంకు చెందిన ప్రదీప్, రమ్య ఉభయ దారులుగా వ్యవహరించారు. శయనోత్సవానికి మొగిలి బ్రాహ్మణసంఘం, అర్చకులు, పురోహితులు ఉభయ దారులుగా వ్యవహరించారు. ఉత్సవాలలో భాగంగా శుక్రవారం ఉదయం స్వామి, అమ్మ వారికి అభిషేకం, రాత్రి తెప్పోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఈఓ మునిరాజ తెలిపారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



ఆర్థిక సాయం అందజేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు

ఐరాల: మండలంలోని కలికిరిపల్లెలో నాగేష్, కవిత దంపతులు నివాసం ఉంటున్న రేకుల ఇంట్లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో ఇంటిలోని నిత్యవసర వస్తువులు, కుట్టు మిషన్, టీవీ, బీరువా, నగదు, ఐదు సవర్ల బంగారం పూర్తిగా కాలిపోయాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. విషయం తెలుసుకున్న పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నేతలు ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అన్ని రకాలుగా సహాయంగా ఉంటామని భరోసానిచ్చారు. ఆ కుటుంబ సభ్యులకు వైఎస్సార్ సీపీ నేత పూజారి మోహన్‌రెడ్డి రూ.10 వేల నగదు, కన్వీనర్, నాయకులు నిత్యావసర వస్తువులను అందజేశారు.

రాసనపల్లెలో కార్డెన్‌సెర్చ్



గ్రామస్తులతో మాట్లాడుతున్న సెబ్ అదనపు ఎస్పీ సుబ్బరాజు

గుడిపాల: మండలంలోని రాసనపల్లెలో గురువారం ఉదయం పోలీసులు, సెబ్ పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ రవిశంకర్‌రెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో రాసనపల్లెలో సారా తయారీ అధికంగా ఉండడం వల్ల ఈ దాడులు నిర్వహించామన్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి సారా తయారుచేసినా, విక్రయాలు జరిపినా కఠినంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. అనంతరం రాసనపల్లె సమీపంలోని అటవీ ప్రాంతంలో సారా ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో 15లీటర్ల నాటుసారాతో పాటు, సారాకి ఉపయోగించే చెక్కను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఏఎస్‌ఐ చలపతి, సిబ్బంది ఎబినేషన్, కార్తీక్, మంజు, బాబుతో పాటు సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కుల పుస్తకం ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు

ఐరాల: దివ్యాంగుల హక్కుల చట్టం – 2016 తెలుగు అనువాదం పుస్తకాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ రమేష్‌బాబు చేతుల మీదుగా గురువారం దివ్యాంగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొణతం చంద్రశేఖర్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు సుమతితో కలిసి ఆవిష్కరించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ దివ్యాంగులపై దాడి చేసినా, వైకల్యం పేరుతో దూషించినా, దివ్యాంగ మహిళలపై అత్యాచారాలకు పాల్పడినా దివ్యాంగుల అట్రాసిటీ చట్టం –2016లోని సెక్షన్ 92 ప్రకారం కేసు నమోదు చేయాలని సూచించారు.

మామిడి చెట్లు దగ్ధం

తవణంపల్లె: మండలంలోని పైపల్లె సమీపంలోని అడవిలో గురువారం సాయంత్రం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు వంద ఎకరాల్లో మామిడి, టేకు చెట్లు బుగ్గి అయ్యాయి. పైపల్లెకు చెందిన 32 మంది దళిత రైతులకు అడవిలో సుమారు వంద ఎకరాల్లో 17 ఏళ్ల నాటి మామిడి తోటల కంచెకు దుండగులు నిప్పు పెట్టారు. సుమారు 3 వేల చెట్లు కాలిపోయాయని బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఐరాల: మండలంలోని గోళ్లవారిపల్లెకు చెందిన ముద్దలగుంట చిన్నబ్బ తనకున్న ఐదు ఎకరాల్లో మామిడి చెట్లను పెంచారు. గురువారం మధ్యాహ్నం ఆకతాయిలు నిప్పు పెట్టడంతో పూత, పిందె దశలో ఉన్న 60 మామిడి చెట్లు, 50 తాటి చెట్లు, డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. వసంతకు చెందిన మామిడి తోటలో 24 చెట్లు నీరుకుండ చిన్నబ్బకు చెందిన 35 మామిడి చెట్లతోపాటు ముళ్ల కంచె కాలిపోయింది.

ఓటు హక్కుపై వినియోగంపై అవగాహన



గుడిపాల: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గుడిపాల: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని ఎస్‌ఐ శ్రీనివాసరావు అన్నారు. సీఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో గుడిపాల, చీలాపల్లె, రాసనపల్లె గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రెండు, మూడు రోజుల్లో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో నియమావళిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో ప్రచారాలు ప్రజలను రెచ్చగొట్టేలా ఉండకూడదని సూచించారు. ర్యాలీలు, రోడ్‌షోలు, మైకుల కు అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఓటేద్దాం

యాదమరి: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీఓ సింగయ్య సూచించారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో గురువారం సంఘమిత్రలకు, మహిళ సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం కల్పలతా రెడ్డి పాల్గొన్నారు.

యాదమరి: మండల కేంద్రంలో పోలీసుల కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో గురువారం ఉదయం చిత్తూరు వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డి, ఎస్‌ఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలతో పోలీసు స్టేషన్ నుంచి యాదమరి మెయిన్ బజారు, పెరుమాళ్లపల్లె వరకు కవాతు నిర్వహించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని, ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, కేంద్ర బలగాలు ఉన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పూతలపట్టు: ఓటు హక్కును తప్పనిసరిగా ఓటర్లు వినియోగించుకోవాలని ఏపీఎం నాగరత్న తెలిపారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గురువారం డ్వాక్రా సంఘ సభ్యులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ కొత్తగా ఓటు హక్కును వినియోగించుకునే వారికి ఓటు ప్రాముఖ్యతను వివరించాలని సంఘమిత్రలకు తెలిపారు. కార్యక్రమంలో సీసీలు శోభన్, సోమశేఖర్, సంఘమిత్రలు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



చిల్లగుండ్లపల్లెలో మినరల్‌వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న దీపరెడ్డి

బంగారుపాళెం: మండలంలోని చిల్లగుండ్లపల్లెలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను గురువారం ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వైద్య సలహాదారు, ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ వాసుదేవరెడ్డి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం రూ 3.4 లక్షలు విరాళంగా అందజేశారు. వాటర్ ప్లాంట్‌ను వాసుదేవరెడ్డి సతీమణి దీపరెడ్డి ప్రారంభించారు. అంతకు ముందు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య ప్రయోజనాల కోసం శుద్ధ తాగునీరు అందించాలనే ఉద్దేశంతో ఉచితంగా మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఐ వాసుదేవ రెడ్డి తమ గ్రామానికి విచ్చేసిన సందర్భంగా గ్రామానికి ఉచిత మినరల్ ప్లాంట్ కావాలని కోరినట్లు చెప్పారు. దీంతో వాటర్ ప్లాంట్ అవసరమైన నిధులను వాసుదేవరెడ్డి విరాళంగా అందించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దీప, ఎంపీటీసీ ఇందుశేఖర్‌రెడ్డి, నాయకులు బాబు, మంజునాథ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌వేలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమని వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని కృష్ణాపురంలో డాక్టర్ వినయ్‌కుమార్, తెల్లగుండ్లపల్లెలో మోహన్‌వేలు గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా 135 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలన్నారు. గర్భవతులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య బృందం, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటి వద్దకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని నాగంవాండ్లపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన



కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న మహిళలు

గుడిపాల: టీడీపీ సోషల్ మీడియా ట్రోలింగ్‌తో తెనాలికి చెందిన గీతాంజలి మానసిక వేదనకు గురై ఆత్మహత్య చేసుకుందని మండలంలోని నంగమంగళం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కలైఅరసి అన్నారు. నంగమంగళంలో గురువారం సాయంత్రం మహిళలు కొవ్వొత్తులు చేతబట్టి శాంతి ర్యాలీ నిర్వహించారు.

చెత్తకుప్పలు వేయకుండా మొక్కలు





మిట్టూరులో చెత్తకుప్పలతో నిండిన బిన్ (ఫైల్), స్థానికులతో మొక్కలు నాటిస్తున్న కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: నిన్నటి వరకు అక్కడ అంతా వ్యర్థాలను కుప్పలుగా పడేసేవారు. నేడు ఆ ప్రాంతం పచ్చని మొక్కలతో పరిశుభ్రంగా మారింది. పరిశుభ్రత వైపు అడుగులు వేస్తూ స్థానిక ప్రజలు మిట్టూరు తహసీల్దార్ కార్యాలయం రోడ్డు వద్ద ఉన్న అపరిశుభ్ర ప్రాంతాన్ని పరిశుభ్రంగా మార్చారు. నగరంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రంగా చేసి, మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు మిట్టూరులో వ్యర్థాలతో నిండిన ప్రాంతాన్ని స్థానికుల భాగస్వామ్యంతో శుభ్రంగా మార్చారు. వ్యర్థాలను రోడ్డుపై కుప్పలుగా పడేయడం వల్ల కలిగే అనర్థాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. వ్యర్థాలను తొలగించారు. స్థానికుల సహకారంతో నిరుపయోగమైన డ్రమ్ములను ఏర్పాటు చేసి అందులో పూల మొక్కలను నాటారు. ఇక్కడ ఎవరూ చెత్త పడేయరాదని బోర్డు పెట్టారు. చెత్తను రోడ్లపై పడేయవద్దని, తడి, పొడిగా వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందివ్వాలని ఇన్‌చార్జి ఎంహెచ్‌వో చిన్నయ్య కోరారు. కార్యక్రమంలో వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయండి

పూతలపట్టు: సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని ఆపార్టీ పెనుగొండ పరిశీలకులు బాబురెడ్డి తెలిపారు. అయ్యప్పగారిపల్లి, అంద్రవారిపల్లి, కర్ణంవారిపల్లి, వేపనపల్లి పంచాయతీలోని బూత్ కమిటీ కన్వీనర్లకు, గృహసారథులకు, గురువారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ, గ్రామ స్థాయి పరిధిలోని ఓటర్లకు మన ప్రభుత్వం చేసిన మంచి పనులపై అవగాహన కల్పించాలన్నారు. ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలను సేకరించి ఓటర్లకు తెలియజేయాలన్నారు. టీడీపీ వారి ఓట్లు కూడా ఈ సారి వైఎస్సార్‌సీపీకే వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కన్వీనర్లు సమష్టిగా కలిసి సార్వత్రిక ఎన్నికల్లో జగన్నను గెలిపించాలని కోరారు. తెలుగుదేశం పార్టీని ఈసారి ప్రజలు నమ్మే పరిస్తితి లేదని తెలిపారు. అనంతరం బూత్ కన్వీనర్లకు కరపత్రాలను, ఓటర్లు వివరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల సచివాయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు దొరస్వామిరెడ్డి, సర్పంచ్ ఎంఎస్ మణి, నాయకులు రెడ్డెప్పరెడ్డి, సచివాలయాల కన్వీనర్లు, బూత్ కమిటీ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.